క్లుప్తంగా

రంజాన్ శుభాకాంక్షలు: ఎమ్మెల్యే ఆర్కే

మంగళగిరి: ముస్లింలకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) రంజాన్ శుభాకాంక్షలు శుక్రవారం తెలిపారు. ముస్లింలు ఎంతో పవిత్రంగా భావించే మాసం రంజాన్ సందర్భంగా నెల రోజుల పాటు కఠోర ఉపావాస దీక్షలు ఆచరించిన ముస్లింలు శనివారం రంజాన్ జరుపుకోవడం సంతోషకరమన్నారు. భక్తి ప్రపత్తులతో, ఆనందోత్సవాల మధ్య పండుగ జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

వైఎస్సార్ కంటి వెలుగుతో పేదలకు మేలు



వెంకటపాలెం(తాడికొండ): వైఎస్సార్ కంటి వెలుగు పథకంతో పేదలకు ఎంతో మేలు అని నేత్ర వైద్య నిపుణులు వి.సాంబశివరావు అన్నారు. శుక్రవారం తుళ్లూరు మండలం వెంకటపాలెం గ్రామంలో వైఎస్సార్ కంటి వెలుగు పథకం కింద 60 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 40 మందికి మందులు పంపిణీ చేయడంతో పాటు 20 మందిని కళ్లజోళ్లకు సిఫార్సు చేసినట్లు పేర్కొన్నారు.

25న మెగా వైద్య శిబిరం

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని నులకపేటలోని చైతన్య తపోవన్ 26వ వార్షికోత్సవం సందర్భంగా ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తపోవన్ నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విజయవాడకు చెందిన ఎంజే నాయుడు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సహకారంతో శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దుకాణం దగ్ధం

మంగళగిరి: నగరంలోని బీఎండబ్ల్యూ షోరూం ఎదుట ఓ దుకాణంలో శుక్రవారం తెల్లవారుజామున అగ్ని ప్రమాదం సంభవించింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి దుకాణం మొత్తం కాలిపోయింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా ప్రాంతానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అప్పటికే దుకాణంలోని వస్తువులు, ఫర్నిచర్ దగ్ధమైనట్లు దుకాణ యజమాని చింతక్రింది శివ తెలిపారు. సుమారు రూ.1.5 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు చెప్పాడు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మంగళగిరి: నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు దృష్ట్యా శనివారం సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈఈ అక్కల సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర పరిధిలోని పెదవడ్లపూడి ప్రాంతంలో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని చెప్పారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

పేదలకు చీరల పంపిణీ

తాడేపల్లి రూరల్: కార్పొరేషన్ పరిధిలోని వడ్డేశ్వరం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళగిరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి షేక్ సలీం ఆధ్వర్యంలో శుక్రవారం పేద మహిళలకు చీరల పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్‌వలి, రాష్ట్ర అధికార ప్రతినిధి తాడికొండ వెంకటేశ్వరరావు, నాయకులు దర్శనపు శామ్యూల్, పఠాన్ సుభాని, షేక్ జల్సా, గోలి సాంబశివరావు, షేక్ చాంద్ బాషా, జంజనం శారద పాల్గొన్నారు.

రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని మృతదేహం

మేడికొండూరు: రైల్వే ట్రాక్ పై గుర్తుతెలియని మృతదేహం పడిఉన్న ఘటన శుక్రవారం పేరేచర్ల –నల్లపాడు మధ్య ట్రాక్‌పై వెలుగుచూసింది. సుమారు 25 సంవత్సరాల వయసు కలిగి ఉండి, చామన చాయ రంగు, బిస్కెట్ పూలరంగు చొక్కా, నలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడు. రైలు నుంచి జారిపడి గాని, ఆత్మహత్య చేసుకునేందుకు రైలు కిందపడి ఉండవచ్చని రైల్వే పోలీస్ అధికారులు అనుమానం వక్తం చేస్తున్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు నరసరావుపేట ఆర్‌పీఎస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు. వివరాలకు 9948525386లో సంప్రదించాలని తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

మేడికొండూరు: విద్యుత్ ఘతానికి గురై వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని డొకిపర్రు శాంతినగర్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. పేరేచర్ల గ్రామానికి చెందిన దేవరకొండ బాబూరావు(35) ఇంటి రేకులు కప్పు వేసే పనిచేసుకుంటూ జీవిస్తున్నాడు. కాలనీలో ఇంటికి రేకులు వేసేందుకు ఇనుప పైపులు సరిచేస్తుండగా పైన విద్యుత్ లైన్‌కు తగిలింది. దీంతో విద్యుదాఘాతానికి గురై దుర్మరణం చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ సందర్శించారు. నివాళులర్పించిన వారిలో ఎంపీపీ మన్నవ స్వప్న ఉన్నారు.

ప్రజలకు మరింత మెరుగైన సేవలు

- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)
- యర్రబాలెంలో గ్రామ సచివాలయం-2,3 ప్రారంభం



ఫిష్ ఆంధ్రా మినీ అవుట్‌లెట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి

మంగళగిరి: ప్రజలకు సత్వర సేవలు అందించాలనే సదుద్దేశంతో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) అన్నారు. మంగళగిరి– తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని యర్రబాలెం శ్రీలక్ష్మీ సూర్య ఎస్టేట్స్ ఆవరణలో నూతనంగా నిర్మించిన సచివాలయం– 2,3 భవన సముదాయాన్ని శుక్రవారం ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీలు మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ సచివాలయాల వ్యవస్థ ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పరిపాలనలో ఒక విప్లవాత్మకమైన మార్పు తీసుకువచ్చారన్నారు. కార్యక్రమంలో ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, నగరపాలక సంస్థ కమిషనర్ యు.శారదాదేవి, డీఈ కృష్ణారెడ్డి, ఏఈ కిషోర్, పంచాయతీ కార్యదర్శి కోటిరెడ్డి, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు గుండాల శ్రీనివాసరావు, కాపరౌతు భాస్కరరావు, పలగాని కోటేశ్వరరావు, దానబోయిన నాగయ్య, మేరిగ నాగేశ్వరరావు, షేక్ షఫీ, ఎస్.గౌస్ పాల్గొన్నారు.

ఫిష్ ఆంధ్రా మినీ అవుట్ లెట్ ప్రారంభం..

నగర పరిధిలోని యర్రబాలెం డాన్‌బాస్కో ఉన్నత పాఠశాల ఎదుట ఏర్పాటు చేసిన ఫిష్ ఆంధ్రా మినీ అవుట్ లెట్‌ను శుక్రవారం ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి ప్రారంభించారు.

ఎయిమ్స్ వద్ద ఆటో స్టాండ్ ప్రారంభం

మంగళగిరి: ఆటో ఓనర్స్, డ్రైవర్స్ జగనన్నకు అండగా నిలవాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) అన్నారు. నగరంలోని ఎయిమ్స్ ఆస్పత్రి గేటు ఆవరణలో ఆటో ఓనర్స్, డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎయిమ్స్ ఆటో స్టాండ్‌ను శుక్రవారం వైఎస్సార్ టీయూసీ రాష్ట్ర అధ్యక్షులు పూనూరు గౌతమ్‌రెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవిలతో కలసి ప్రారంభించారు. వైఎస్సార్ టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు పూనూరు గౌతమ్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కార్మిక పక్షపాతి అన్నారు. సీఎం జగన్ మోహనరెడ్డి అందించిన ఫలాలు కార్మిక వర్గానికి పెద్ద పీట వేశాయని సుస్పష్టంగా తెలుస్తుందన్నారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కార్మికుల సంక్షేమానికి కృతనిశ్చయంతో పని చేస్తున్నారని చెప్పారు. ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి మాట్లాడుతూ ఎయిమ్స్ ఆస్పత్రికి రోగుల మన్ననలను పొందే విధంగా వృత్తి ధర్మాన్ని నిర్వర్తించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, వైఎస్సార్ టీయూసీ విజయవాడ నగర, గుంటూరు జిల్లా అధ్యక్షులు విశ్వనాథ రవి, ఆవుల సుందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందుకు హాజరైన రాజ్యసభ సభ్యుడు ఆళ్ల, జెడ్పీ చైర్‌పర్సన్ హెనీక్రిస్టినా, ఎమ్మెల్సీ లేళ్ల

తాడికొండ: పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాసాలు ఉండి అల్లాను ఆరాధిస్తున్న ముస్లింలు అందరికీ శుభాలు కలగాలని రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, ఉమ్మడి గుంటూరు జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా ఆకాంక్షించారు. తాడికొండ అడ్డరోడ్డులో తాడికొండ నియోజకవర్గ ముస్లింలకు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు హాజరయ్యారు. పవిత్ర మాసంలో ఉపవాసాలు, దీక్షలు, ఆధ్యాత్మిక చింతన, దానాలు, ధర్మాలు చేయడం ద్వారా సమాజానికి ఓ మంచి సందేశం ఇచ్చేలా పవిత్ర రంజాన్ పండుగకు మంచి పేరుందన్నారు. నేడు రంజాన్ పండుగ జరుపుకుంటున్న ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గుంటూరు-2 ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, తాడికొండ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డితో కలసి దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు గుడిమెట్ల జ్యోతి, కందుల సిద్ధయ్య, దాసరి కత్తిరేణమ్మ, ఎంపీపీ సహేలా నర్గీస్, ముఖ్య నాయకులు టి.శివనాగరాజు యాదవ్ పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనులు



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న కత్తెర సురేష్‌కుమార్

మేడికొండూరు: మండల పరిధిలో పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎంపీపీ మన్నవ స్వప్న పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. అధ్యక్షత వహించిన ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమన్వయంతో అధికారులు చేపట్లాని కోరారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలను గుర్తించాలని అధికారులకు సూచించారు. ప్రణాళిక ప్రకారం పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతిఒక్కరికీ అందేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కందుల సిద్ధయ్య, వైస్ ఎంపీపీ భవనం రాజశేఖరరెడ్డి, తహసీల్దార్ జి.కరుణ కుమార్, ఎంపీడీఓ ఎం.శోభారాణి పాల్గొన్నారు.

కృష్ణానదిలో దిగకుండా కంచె ఏర్పాటు



కృష్ణానది ఎగువ ప్రాంతంలో దిగకుండా ముళ్ల కంచె వేసిన పోలీసులు

తాడేపల్లిరూరల్: కృష్ణానది ఎగువ, దిగువ ప్రాంతాల్లో నీటిలో దిగడానికి వీలులేకుండా అన్ని ప్రాంతాల్లో శుక్రవారం ముళ్ల కంచెలు ఏర్పాటు చేశారు. కొన్నిచోట్ల నీటిలోకి దిగేందుకు వీలుగా ఉండే ప్రాంతాల్లో సరదాగా ఈతకు దిగి కొంతమంది ప్రాణాలు పోగొట్టుకుంటుండగా, కొంతమంది నీటిలో మునిగి బలవన్మరణాలు పొందుతున్నారు. వీటిని అరికట్టేందుకు తాడేపల్లి పోలీసులు కృష్ణానదిలో గతంలో కృష్ణానది దిగువ ప్రాంతంలో ఆంజనేయస్వామి దేవస్థానం నుంచి రైల్వే ట్రాక్ వరకు పుష్కర ఘాట్లపై ఇనుప ముళ్ల కంచెలు ఏర్పాటు చేసి ఎవరినీ దిగకుండా అడ్డుకున్నారు. మత్స్యకారులు లోపలికి వెళ్లేందుకు అనుమతి ఇచ్చారు. తాజాగా కృష్ణానది ఎగువ ప్రాంతంలో 23 సంవత్సరాల సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సరదాగా ఈతకు వెళ్లి ప్రాణాలు పోగొట్టుకున్నాడు. వారి తల్లిదండ్రులు ఆవేదన చూసి చలించిన పోలీసులు ఎగువ ప్రాంతంలో ఎవరూ నీటిలోకి దిగకుండా ముళ్లకంచను ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా ఉదయం సమయంలో కొంతమంది నగదును వసూలు చేస్తూ ఈతను నేర్పుతున్నారు. అదే ప్రాంతంలో వారు లేని సమయంలో మద్యం తాగి కొందరు, సరదాగా ఈతకు వచ్చి కొందరు ప్రాణాలు కోల్పోతుండడంతో ఆ ప్రాంతంలో పోలీసులు ముళ్ల కంచె వేశారు. దీనిపై అసోసియేషన్ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు మాత్రం మీరు ఈత నేర్పి, మీ పని మీరు చూసుకుని వెళ్లిపోతున్నారు, అనంతరం ఎంతోమంది ఈ ప్రాంతంలో దిగి ప్రాణాలు కోల్పోతున్నారు. ఆ విధంగా కృష్ణానదిలోకి దిగకుండా మీరు కాపలా పెడతారా? వచ్చే వారిని అడ్డుకుంటారా? అని పోలీసులు ప్రశ్నించడంతో అసోసియేషన్ వారు నుంచి ఎటువంటి సమాధానం రాలేదు. ముళ్ల కంచెను తొలగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కృష్ణానదిలో ఎక్కడా దిగకుండా చర్యలు తీసుకున్నామని తాడేపల్లి పోలీసులు తెలిపారు.

మసీదుకు ఎమ్మెల్యే ఆర్కే రూ.లక్ష విరాళం

మంగళగిరి: నగర పరిధిలోని నవులూరు ఇమామ్ హుస్సేన్ మసీదు పునఃనిర్మాణానికి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ సీపీ మైనార్టీ నేతల చేతుల మీదుగా మసీదు కమిటీ ప్రతినిదులకు విరాళాన్ని అందజేశారు.

మజ్జిగ పంపిణీ



ఫిరంగిపురం: మండలంలోని బేతపూడిలో శుక్రవారం తాగునీటి చలివేంద్రం వద్ద మజ్జిగను ఎంపీటీసీ సభ్యుడు షేక్ ఖాసిం షాహీద్ పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలం కావడంతో ప్రజలు దాహార్తికి ఇబ్బందిపడకుండా మంచినీటితో పాటు మజ్జిగను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో షాహీద్, ఖాజావలి పాల్గొన్నారు.

ముస్లిం కుటుంబాలకు ఆర్థిక సాయం

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని పేద ముస్లిం కుటుంబాలకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి అందించిన రూ.95వేల ఆర్థిక సాయాన్ని జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ శుక్రవారం అందజేశారు. దుగ్గిరాల ముస్లిం కాలనీకి చెందిన షేక్ సమీలా కుటుంబానికి రూ.25 వేలు, షేక్ జాకీర్ కుటుంబానికి రూ.20 వేలు, షేక్ జలీల్ కుటుంబానికి రూ.10వేలు, షేక్ బాజీ కుటుంబానికి రూ.20 వేల రూపాయలు, పటాన్ హసీనా ఖాన్, షేక్ సలాం కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ బాజీ, దుగ్గిరాల గ్రామ సర్పంచి బాణావత్ కుషీభాయ్, వైఎస్సార్‌సీపీ నాయకులు కంభంపాటి క్రాంతికుమార్, దుగ్గిరాల వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని, రఘునాథ్ యాదవ్, ఆత్మకూరి నాగేశ్వరరావు, వెంకటేశ్వ నాయక్, షేక్ కరీముల్లా, షేక్ సలీం, జాని, మునీర్, షేక్ షంషేర్, ఉన్నం రాజేష్ పాల్గొన్నారు.

27న పాత సామగ్రి బహిరంగ వేలం

తాడికొండ: స్థానిక ఏపీ గురుకుల పాఠశాల బాలురు(రీజనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్)లో ఈ నెల 27వ తేదీన పాత ఇనుము, చెక్క సామగ్రి బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఏ బాలశ్రీ తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు ఈ నెల 22వ తేదీ నుంచి ప్రిన్సిపాల్ రీజనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, తాడికొండ పేరుతో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లో రూ.5 వేలు డీడీ రూపంలో ధరావత్తు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 9866559633 సంప్రదించాలని సూచించారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు వినతి



తహసీల్దార్ మల్లేశ్వరికి విజ్ఞాపన పత్రం అందజేస్తున్న జొన్నా శివశంకరరావు

దుగ్గిరాల(తాడేపల్లిరూరల్): పసుపు, మొక్కజొన్న, జొన్న పంటల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాని తహసీల్దార్ మల్లేశ్వరికి ఏపీ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెల్టాలో ఇప్పటికే జొన్న, మొక్కజొన్న, పసుపు పంటలు చేతికి వచ్చాయని, ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు తెరిచి మద్దతు ధరలకే కొంటామని జిల్లా అధికారులు ప్రకటించారని కానీ కొనుగోలు జరగకపోవడం వల్ల రైతులు తక్కువ ధరలకు అమ్ముకుని దళారుల చేతిలో మోసపోతున్నారని అన్నారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు, రైతు సంఘం అధ్యక్షులు నడకుదురు యోగేశ్వరరావు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మన్నవ నాగమల్లేశ్వరరావు, రైతు సంఘం నాయకులు వల్లభనేని సాంబశివరావు పాల్గొన్నారు.

భక్తులకు మరిన్ని సదుపాయాలు

టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం



వెంకటపాలెం టీటీడీ ఆలయంలో అధికారులతో మాట్లాడుతున్న జేఈఓ వీరబ్రహ్మం

తాడికొండ: గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం అనంతవరం, అమరావతిలోని వెంకటపాలెం శ్రీవారి ఆలయాల్లో భక్తులకు మరిన్ని వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం ఆదేశించారు. రెండు ఆలయాలను శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అనంతవరం శ్రీవారి ఆలయానికి వెళ్లే ఘాట్ రోడ్డును భక్తులకు సౌకర్యవంతంగా ఆధునికీకరించాలని సూచించారు. భక్తులు ఎండకు ఇబ్బంది పడకుండా షెల్టర్ నిర్మించాలని, ఆలయం చుట్టూ కాంపౌండ్ వాల్, దాతల సహకారంతో భక్తులు వేచి ఉండటానికి హాల్ నిర్మించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కల్యాణ మండపంలో అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టాలని, ఆలయానికి వెళ్లే ఘాట్ రోడ్డులో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. కొండ కింద ఉన్న ఖాళీ ప్రదేశాన్ని భక్తులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అమరావతి ఆలయంలో భక్తులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా ఉద్యానవనం ఏర్పాటు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 4 మాడ వీధులను త్వరగా ఏర్పాటు చేయాలని జేఈఓ ఆదేశించారు. భక్తులకు పార్కింగ్ ప్రదేశం ఏర్పాటు చేయాలని, పుష్కరిణి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. వివిధ మార్గాల ద్వారా ఆలయానికి వచ్చే భక్తుల సదుపాయం కోసం సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ఆలయ ముఖ ద్వారం వద్ద ఆర్చి, కాంపౌండ్ వాల్, భక్తులు వేచి ఉండే హాల్, సెక్యూరిటీ గది, ఉద్యోగులు, అర్చకుల క్వార్టర్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సన్నిధిలో విద్యుత్ బ్లోయర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, ఎస్ఈలు సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, డాక్టర్ రవి, డెప్యూటీ ఈఓ వెంకటయ్య, డెప్యూటీ ఈఈ నాగభూషణం, విద్యుత్ విభాగం డెప్యూటీ ఇంజినీర్ నాగరాజు పాల్గొన్నారు.

పాఠశాల ప్రధానోపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం

దుగ్గిరాల(తాడేపల్లి రూరల్): దుగ్గిరాల మండల పరిధిలోని పాఠశాల ప్రధానోపాధ్యాయులకు సామాజిక తనిఖీ కార్యక్రమంపై శుక్రవారం శిక్షణ నిర్వహించారు. ఎంఈఓ కె.శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ సామాజిక తనిఖీ ప్రశ్నపత్రంలో మొత్తం ఆరు ప్రధాన అంశాలు ఉన్నాయని తెలిపారు. పాఠశాల మౌలిక వనరులు, ఉపాధ్యాయుల ప్రగతి విద్యార్థులు, ప్రగతి సౌకర్యాలు, విద్యార్థుల సెక్యూరిటీ, కమ్యూనిటీ మొబలైజేషన్ మరియు 42 ఉప అంశాల గురించి నాలుగు లెవల్స్ గురించి ప్రధానోపాధ్యాయులకు వివరించడం జరిగిందని అన్నారు. 107 ప్రశ్నలను ఎలా పూర్తిచేయాలో పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఉపాధ్యాయులకు రీసోర్స్ పర్సన్ ఏడుకొండలు వివరించారు. ఈనెల 29వ తేదీ లోగా సామాజిక తనిఖీ రిపోర్టులను యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా రీసోర్స్ పర్సన్ ఎం.ఏడుకొండలు, ఉన్నం ప్రసాద్, వివిధ పాఠశాలల నుండి 53 మంది ప్రధానోపాధ్యాయులు హాజరయ్యారు.

రైతులకు రుచికరమైన భోజనం అందించాలి

మిర్చి యార్డు చైర్మన్ సుధాకర్‌రెడ్డి

కొరిటిపాడు(గుంటూరు): మిర్చి రైతులకు నాణ్యతతో కూడిన రుచికరమైన భోజనం అందించాలని గుంటూరు మార్కెట్ యార్డు చైర్మన్ మద్దిరెడ్డి సుధాకర్‌రెడ్డి కాంట్రాక్టరును ఆదేశించారు. మార్కెట్ యార్డులో శుక్రవారం కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డితో కలసి ఉచిత భోజనశాలను ఆయన సందర్శించారు. రైతులతో కలసి స్వయంగా వారు భోజనం చేశారు. అనంతరం యార్డులో పర్యటించారు. రైతులతో మాట్లాడి సేవలు, మిర్చి ధరల్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ కమీషన్ షాపుల ముందు మిర్చి బస్తాలను ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా క్రమపద్ధతిలో ఉంచుకోవాలని సూచించారు. ఎగుమతి వ్యాపారులు ఏ రోజు కొనుగోలు చేసిన మిర్చి బస్తాలను అదే రోజు బయటకు తరలించాలని చెప్పారు. ప్రతి దిగుమతి షాపు వద్ద డస్ట్‌బిన్‌ను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రైతులకు మంచి ధర లభించేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. ఆయన వెంట యార్డు ఇన్‌చార్జి కె.శివారెడ్డి తదితరులున్నారు.

ముస్లింల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

డీసీసీబీ చైర్మన్ రాము

ఫిరంగిపురం: రాష్ట్రంలో ముస్లింల సంక్షేమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని డీసీసీబీ చైర్మన్ రాతంశెట్టి సీతారామాంనేయులు(రాము) పేర్కొన్నారు. మండలంలోని అమీనాబాద్‌లో ముస్లిం మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. రాము మట్లాడుతూ పేదలకు బ్యాంకు ద్వారా రుణాలు మంజూరు చేసి ఆర్థికంగా ఆదుకుంటున్నట్లు చెప్పారు. వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ మాట్లాడుతూ మైనార్టీలకు ఉపముఖ్యమంత్రి పదవిని ఇచ్చి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారికి పెద్దపీట వేశారని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ, ఎంపీటీసీ సభ్యుడు గాంధీబుడే, అబ్దుల్ గఫార్, కె.ఆనంద్, ఎంపీడీఓ డి.అనూరాధ, పి.మరియబాబు, ఎం.సుధాకరరెడ్డి, ఖాసిం షాహిద్, ఎస్‌కే.రఫి, చాన్‌బాషా, బాజీ, పెద్ద బుజ్జి, షాదుల్లా, పి.వెంకట్రావు, నాగరాజు, చేవూరి రామమోహన్‌రెడ్డి, ఇజ్రాయిల్, కమలారెడ్డి, ఈసా మాస్టర్, ఏపీఎం సుజాత, కార్యదర్శులు ఏకేబాబు, మధు పాల్గొన్నారు.

ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు

తాడికొండ: నియోజకవర్గ ముస్లింలకు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. సత్య, నిష్ఠ, దాన ధర్మాలు ఉపవాస దీక్షలతో గడిపి రంజాన్ పండుగను జరుపుకుంటున్న ముస్లింలు భావితరాలకు ఆదర్శంగా ముందుకెళ్లాలని సూచించారు.

ఉత్సాహంగా జగనన్నే మా భవిష్యత్



జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో పాల్గొన్న ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి

మంగళగిరి: నగరంలోని ఆయా వార్డుల్లో జగనన్నే మా భవిష్యత్– మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం కొనసాగుతోంది. శుక్రవారం నగరంలోని ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి పాల్గొని ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలను వివరించి ప్రజా మద్దతుపై సర్వే నిర్వహించారు. నగరంలోని 15వ వార్డుతో పాటు ఆయా వార్డులు, నిడమర్రు, కాజ, ఆత్మకూరు, చినకాకాని, నవులూరు, యర్రబాలెం, పెదవడ్లపూడి తదితర ప్రాంతాల్లో నిర్వహించారు.

నిస్సహాయ బాలలకు అండగా ఉండాలి



నెహ్రూనగర్: తల్లిదండ్రుల్ని కోల్పోయి నిరాదరణ, నిస్సహాయ, నిరాశ్రయులైన పిల్లలకు మిషన్ వాత్సల్య పథకం కింద నెలకు రూ.4వేల ఆర్థిక భరోసా కల్పించే విధంగా సిబ్బంది కృషి చేయాలని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి తెలిపారు. మహిళా ప్రాంగణంలో శుక్రవారం మహిళా శిశు సంక్షేమ శాఖ, బాలల పరిరక్షణ విభాగం అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో బాలల రక్షణ, సంరక్షణ దృష్టిలో పెట్టుకుని ఈ పథకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. విస్తృత స్థాయిలో ప్రచారం నిర్వహించి అర్హులైన ప్రతి ఒక్కరికీ వర్తింపజేయాలని సూచించారు.

అండర్ గ్రౌండ్ కేబుల్ పైపులు దగ్ధం



తాడికొండ: తుళ్ళూరు మండలం నెక్కల్లు గ్రామంలోని బీఎస్ఆర్ ఇన్‌ఫ్రాటెక్ ప్రాజెక్టుకు సంబంధించిన అండర్ గ్రౌండ్ కేబుల్ పైపులు శుక్రవారం అగ్నికి ఆహుతయ్యాయి. 20 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ యార్డులో ఉదయం 10:30 గంటల సమయంలో అగ్ని ప్రమాదం జరిగినట్టు అగ్నిమాపక సిబ్బందికి, పోలీసులకు ఫిర్యాదు వచ్చింది. దీంతో వెంటనే ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. నష్టం వివరాలు తెలియాల్సి ఉంది.